www.siridaily.com
RNI TG TEL/ 26/A0381
సిరి
People's Voice వార్తపత్రిక
మంగళవారం
సెప్టెంబర్-22-2026
సంపుటి (Volume) : 2
సంచిక (Issue) 257
పేజీలు : 5

# సర్వీస్ రోడ్డుపై ఇసుక లారీల తొలగింపు

- హెచ్చరికలు.. ప్రమాదం.. ఆపై అధికారుల చర్యలు
- వరుస కథనాలకు స్పందన..
- ఇతర వాహనాల పార్కింగ్, రోడ్డుపై ఇసుకపైనా చర్యలు తీసుకోవాలి




2



# కాలుష్యం స్థానికులకు.. నిధులు పక్కకు!

## హత్నూర మండలంలో పరిశ్రమల విస్తరణ

- పెరుగుతున్న కాలుష్యం, అనారోగ్య బాధితులు
- కంపెనీల చట్టం సెక్షన్ 135 ప్రకారం స్థానిక ప్రాంతాలకే ప్రాధాన్యత
- కాలుష్య కోరల్లో చిక్కుకున్న 12కు పైగా ప్రభావిత గ్రామాలు
- గుండ్లమాచునూరు, బోరపట్లలో తీరని తాగునీరు, రోడ్ల సమస్యలు
- బడి, వైద్యం, పారిశుధ్యానికి అందని కార్పొరేట్ నిధులు
- కాగితాల్లో స్థానిక పనులు చూపి నిధులు దారిమళ్లిస్తున్న కంపెనీలు
- కాలుష్యానికి గురవుతున్న ప్రజల ఆరోగ్యానికి కనీస భరోసా కరవు
- జిల్లా కలెక్టర్, పరిశ్రమల శాఖ సమీక్ష చేపట్టాలని స్థానికుల డిమాండ్

5

(మహమ్మద్ జావెద్)
(హత్నూర-సిరిన్యూస్)

సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం పారిశ్రామికంగా వేగంగా అభివృద్ధి చెందుతున్నప్పటికీ, ఆ అభివృద్ధి స్థానిక గ్రామాల ప్రజల పాలిట శాపంగా మారుతోంది. పరిశ్రమల స్థాపన కోసం విలువైన భూములు, అమూల్యమైన భూగర్భ జలాలు, రహదారులు తదితర స్థానిక వనరులను కంపెనీలు యథేచ్ఛగా వినియోగించుకుంటున్నాయి. అయితే వాటి నుంచి వెలువడే ప్రమాదకర రసాయన వ్యర్థాలు, విషవాయువులు, కాలుష్య దుష్ప్రభావాలను మాత్రం ఇక్కడి ప్రజలే నిత్యం భరిస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో కంపెనీలు తమ లాభాల నుంచి చట్టబద్ధంగా ఖర్చు చేయాల్సిన కార్పొరేట్ సామాజిక బాధ్యత నిధులు ఎటు పోతున్నాయనే ప్రశ్న మండలవ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. కాలుష్యం మాత్రం స్థానికులకు ఇచ్చి, సీఎస్ఆర్ నిధులను మాత్రం ఇతర ప్రాంతాలకు తరలించడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది.



## జగ్గారెడ్డిని కలిసిన డీసీసీ అధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డి

సంగారెడ్డి, సెప్టెంబర్ 21 : సంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన చంద్రశేఖర్ రెడ్డి నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డితో కలిసి టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డిని సంగారెడ్డి పట్టణంలోని రామ్‌నగర్ రామ్ మందిర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన డీసీసీ అధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డిని జగ్గారెడ్డి ఘనంగా సన్మానించి అభినందించారు.



3




# బలమైన ఆకాంక్షగా నియోజకవర్గ పోరాటం!

## నియోజకవర్గ హోదా కోసం ఒక్కటవుతున్న రామాయంపేట ప్రజలు

రెవెన్యూ డివిజన్ సాధనతోనే నియోజకవర్గమంటున్న స్థానికులు

పూర్వ వైభవం రావాలంటే నియోజకవర్గం కావాల్సిందే

- డీ లిమిటేషన్‌లో కోల్పోయిన హోదా..
- మళ్లీ డీ లిమిటేషన్‌లోనే సాధించుకోవాలన్న పట్టుదల
- ప్రజా ఆకాంక్షను ప్రభుత్వం గుర్తించాలి..
- పూర్తిస్థాయి రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలి
- ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామంటున్న ప్రజాసంఘాలు
- ఆత్మ గౌరవ ప్రతీకగా నియోజకవర్గం సాధించే వరకు పోరాటమంటున్న నేతలు

4

రామాయంపేటకు తిరిగి అసెంబ్లీ నియోజకవర్గ హోదా సాధించాలన్న ఆకాంక్ష పార్టీలకతీతంగా బలపడుతోంది. రాజకీయ పార్టీలకు అతీతంగా కుల సంఘాలు, ప్రజా సంఘాలు, వివిధ వర్గాల ప్రజలు ఏకతాటిపైకి వచ్చి రామాయంపేటకు నియోజకవర్గ హోదా వచ్చేలా కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు. ముందుగా రామాయంపేట రెవెన్యూ డివిజన్‌ను పూర్తిస్థాయిలో ఏర్పాటు చేసి, పెండింగ్‌లో ఉన్న ప్రక్రియను ప్రభుత్వం వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

(డి.జి. శ్రీనివాస శర్మ)
(రామాయంపేట-సిరి న్యూస్)





సిరి ఎఫెక్ట్

# సర్వీస్ రోడ్డుపై ఇసుక లారీల తొలగింపు

- హెచ్చరికలు.. ప్రమాదం.. ఆపై అధికారుల చర్యలు
- వరుస కథనాలకు స్పందన..
- ఇతర వాహనాల పార్కింగ్, రోడ్డుపై ఇసుకపైనా చర్యలు తీసుకోవాలి



**రామచంద్రాపురం, సెప్టెంబర్ 21 (సిరి న్యూస్):** ప్రమాదం జరగకముందే 'సిరి' హెచ్చరించింది.. సమస్యను పలుమార్లు వెలుగులోకి తెచ్చింది.. అయినా అప్పట్లో అధికారులు స్పందించలేదు. సర్వీస్ రోడ్డుపై ఇసుక లారీలను నిలిపి ఉంచడం, రోడ్డంతా ఇసుక పేరుకుపోవడం, ఇతర వాహనాలను అడ్డదిడ్డంగా పార్కింగ్ చేయడంపై వరుస కథనాలు ప్రచురించింది. చివరకు ఇసుక లారీని రివర్స్ చేస్తుండగా ఓ వాకర్ మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది.ఈ ఘటన అనంతరం 'సిరి' మళ్లీ కథనాలతో సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లింది. దీంతో అధికారులు స్పందించి సర్వీస్ రోడ్డుపై నిలిపి ఉంచిన ఇసుక లారీలను తొలగించారు. దీంతో కొంతమేర రహదారిపై వెసులుబాటు కలిగింది.అయితే సమస్య పూర్తిగా పరిష్కారం కాలేదని స్థానికులు చెబుతున్నారు. కంపెనీ బస్సులు, షోరూమ్ కార్లు, ద్విచక్ర వాహనాలను కూడా అడ్డదిడ్డంగా నిలిపివేస్తున్నారని, రోడ్డుపై పేరుకుపోయిన ఇసుకతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొంటున్నారు. వాటిపైనా అధికారులు చర్యలు తీసుకుని సర్వీస్ రోడ్డును ప్రజలకు ఇబ్బందులు లేకుండా తీర్చిదిద్దాలని కోరుతున్నారు. ఇసుకపై వాహనాల నిలుపుదలపై నిరంతర పర్యవేక్షణ చేపట్టి, రోడ్డుపై ఇసుక పేరుకుపోకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.












## నిజమేనా... ఆకతాయిల పనా?

### ఎర్రటి కరపత్రంతో తూప్రాన్ లో కలకలం

**తూప్రాన్ మున్సిపల్ కార్యాలయ గేటుకు అతికించిన ఘటన**

**తూప్రాన్, సెప్టెంబర్ 21 (సిరిన్యూస్) :** తూప్రాన్ మున్సిపల్ కార్యాలయం గేటుకు సోమవారం ఏపీటిహెచ్ కార్యాలయం ప్రధాన గేటుకు గుర్తుతెలియని వ్యక్తులు ఎర్రటి వస్త్రాన్ని కట్టి ఓ లేఖను ఉంచి వెళ్లారు. ఆ లేఖలో 10 మంది విప్లవ యోధులకు ఉరిశిక్ష విధించడాన్ని తీవ్రంగా ఖండిస్తూ పలు అంశాలను ప్రస్తావించారు. లేఖను గుర్తించిన మున్సిపల్ సిబ్బంది వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు లేఖను స్వాధీనం చేసుకుని దర్యాప్తు చేపట్టారు. లేఖను ఎవరు ఉంచారు? దీని వెనుక ఎవరున్నారు? అనే విషయాలపై ఆరా తీస్తున్నారు. మున్సిపల్ కార్యాలయం గేటుకు ఎర్రటి వస్త్రం కట్టి లేఖను ఉంచిన ఘటనతో పాటు తూప్రాన్ పోలీస్ స్టేషన్ ఆవరణలో అలాంటిదే మరో లేఖను వదిలి వెళ్ళిన ఈ ఘటనకు సంబంధించినది ఎవరనేది పూర్తి వివరాలను సేకరిస్తూ కరపత్రాలను ఎవరు ఏర్పాటు చేశారనే విషయంపై దర్యాప్తు చేస్తున్నట్లు తూప్రాన్ ఎస్ఐ గంగరాజు తెలిపారు.



## రామాయంపేట కు చేరుకున్న విశ్వకర్మ ఏక్తా యాత్ర

### ఘన స్వాగతం పలికిన విశ్వకర్మ కులస్తులు

**రామాయంపేట, సెప్టెంబర్ 21 (సిరి న్యూస్)** విశ్వకర్మల ఐక్యత, హక్కులు, అభివృద్ధి కోసం హైదరాబాద్ నుంచి ఢిల్లీ వరకు కొనసాగుతున్న విశ్వకర్మ ఏక్తా యాత్ర మెదక్ జిల్లా రామాయంపేటకు సోమవారం చేరుకుంది. ఈ సందర్భంగా స్థానిక విశ్వకర్మ కులస్తులు యాత్ర బృందానికి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా బ్రహ్మశ్రీ విశ్వనాథుల పుష్పగిరి మాట్లాడుతూ.. ప్రపంచంలోనే అత్యధికంగా ఆకలి చావులు, ఆత్మహత్యలతో అల్లాడుతున్న కుటుంబా ల్లో స్వర్ణకార కుటుంబాలు కూడా ఉన్నాయని అన్నారు. స్వర్ణకారుల సమస్యల పరిష్కారం కోసం హైదరాబాద్ నుంచి ఢిల్లీ వరకు పాదయాత్ర చేపట్టినట్లు తెలిపారు. బంగారం ధరలు పెరగడం, ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వ్యాపారుల కారణంగా స్థానిక స్వర్ణకారులు తమ కులవృత్తిని కోల్పోతున్న పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని వారిని రక్షించడంతో పాటు వృత్తికి భరోసా కల్పించడమే విశ్వకర్మ ఏక్తా యాత్ర ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. విశ్వకర్మ సమాజం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కా రం, 25 డిమాండ్ల సాధన కోసం యాత్ర కొనసాగుతోందన్నారు. సంప్రదాయ వృత్తులను కాపాడు తూ ఆధునిక సాంకేతికత, నైపు ణ్యం, మార్కెట్ అవకాశాలతో విశ్వకర్మలను ఆర్థికంగా బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. అనంతరం యాత్ర బృందం ఆచార్య ప్రొఫెసర్ జయశంకర్ సార్ విగ్రహం వద్దకు చేరుకుని పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించింది. జయశంకర్ సార్ ఆశయాలను స్మరించుకుంటూ సామాజిక అభివృద్ధి, ఐక్యత కోసం కృషి చేయాలని ఈ సందర్భంగా ప్రతినిధులు పేర్కొన్నారు. అక్కడి నుంచి విశ్వకర్మ ఏక్తా యాత్ర పాదయాత్రగా ముందుకు సాగింది. రామాయంపేటలో యాత్రకు విశ్వకర్మ కులస్తులు పెద్ద సంఖ్యలో హాజరై తమ సంఘీభావాన్ని తెలిపా రు. ఈ కార్యక్రమంలో స్వర్ణకార సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సుంకోజు దామోదర్, మండల నాయకులు ఎల్లిది లక్ష్మీనారాయణ, రామ కృష్ణ చారి, పూర్ణ రవి చారి, వేణుమాధవ్, తదితరులు పాల్గొన్నారు.





# జగ్గారెడ్డిని కలిసిన డీసీసీ అధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డి

సంగారెడ్డి, సెప్టెంబర్ 21 : సంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన చంద్రశేఖర్ రెడ్డి నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డితో కలిసి టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డిని సంగారెడ్డి పట్టణంలోని రామ్‌నగర్ రామ్ మందిర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన డీసీసీ అధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డిని జగ్గారెడ్డి ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ నిర్మలా జగ్గారెడ్డి డీసీసీ అధ్యక్షురాలిగా ఏడు సంవత్సరాలకు పైగా సుదీర్ఘకాలం పనిచేశారని తెలిపారు. ఆమె హయాంలో జిల్లా కేంద్రంలో ఏ విధంగా పార్టీ కార్యక్రమాలను నిర్వహించామో, అంతకంటే ఎక్కువగా చంద్రశేఖర్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాలను నిర్వహిస్తామని చెప్పారు. చంద్రశేఖర్ రెడ్డికి తన పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. నూతన డీసీసీ అధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ తనను డీసీసీ అధ్యక్షుడిగా ఎంపిక చేయడంలో సహకరించిన మంత్రి దామోదర్ రాజనర్సింహ, ఇన్‌చార్జి మంత్రి వివేక్ వెంకటస్వామి, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.

**అధిష్టానానికి కృతజ్ఞతలు: ఎమ్మెల్యే సంజీవరెడ్డి**

నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి మాట్లాడుతూ తన తమ్ముడు చంద్రశేఖర్ రెడ్డిపై నమ్మకంతో డీసీసీ అధ్యక్షుడిగా నియమించిన ఏఐసీసీ అధిష్టానానికి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే చంద్రశేఖర్ రెడ్డి ఎంపికకు సహకరించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి దామోదర్ రాజనర్సింహ, జగ్గారెడ్డిలకు ధన్యవాదాలు తెలిపారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి అందరి సహకారంతో ముందుకు సాగుతామని పేర్కొన్నారు.

# ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సంగారెడ్డి జిల్లా శాఖ ఎన్నికలకు నోటిఫికేషన్

సంగారెడ్డి, సెప్టెంబర్ 21 (సిరిన్యూస్) : ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సంగారెడ్డి జిల్లా శాఖ నిర్వహణ కమిటీ ఎన్నికలను అక్టోబర్ 4, 2026న నిర్వహించ నున్నట్లు ఎన్నికల అధికారి, జిల్లా వ్యవసాయ శాఖ సంయుక్త సంచాలకులు శివప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంగారెడ్డి జిల్లా శాఖకు చెందిన ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సభ్యుల జాబితాను ఇప్పటికే ప్రచురించినట్లు, సభ్యులందరికీ ఎన్నికల కార్యక్రమానికి సంబంధించిన సమాచారాన్ని తెలియజేసినట్లు ఆయన తెలిపారు. నిర్వహణ కమిటీ సభ్యుల పదవులకు నామినేషన్ల స్వీకరణ సెప్టెంబర్ 24న ఉదయం 10.00 గంటల నుంచి మధ్యాహ్నం 1.00 గంటల వరకు కలెక్టరేట్‌లోని ఎన్నికల అధికారి కార్యాలయంలో జరుగుతుందని తెలిపారు. సెప్టెంబర్ 25న ఉదయం 10.00 గంటల నుంచి నామినేషన్ల పరిశీలన నిర్వహించి, చెల్లుబాటు అయ్యే నామినేషన్ల జాబితాను ప్రచురిస్తామని పేర్కొన్నారు. సెప్టెంబర్ 26న ఉదయం 10.00 గంటల నుంచి మధ్యాహ్నం 1.00 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం ఉంటుందని, అనంతరం తుది నామినేషన్ల జాబితాను ప్రచురించి, అభ్యర్థులకు ఎన్నికల గుర్తులను కేటాయిస్తామని తెలిపారు. అవసరమైన పక్షంలో అక్టోబర్ 4, 2026న ఎన్నికలు నిర్వహిస్తామని ఎన్నికల అధికారి తెలిపారు. ఆరోజు ఉదయం 8.00 గంటల నుంచి మధ్యాహ్నం 3.00 గంటల వరకు పోలింగ్ జరుగుతుందని, సాయంత్రం 4.00 గంటల నుంచి ఓట్ల లెక్కింపు చేపడతామని పేర్కొన్నారు. ఓట్ల లెక్కింపు పూర్తయిన అనంతరం ఫలితాలను ప్రకటిస్తామని, ఫలితాల ప్రకటన అనంతరం ఆఫీస్ బేరర్ల ఎన్నిక నిర్వహిస్తామని వెల్లడించారు. నామినేషన్ దాఖలు చేసే అభ్యర్థులు రూ.10,000 తిరిగి చెల్లించబడని రుసుము (నాన్‌రిఫండబుల్)గా చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. నామినేషన్ ఫారాలను ఎన్నికల అధికారిని వ్యక్తిగతంగా సంప్రదించడం ద్వారా లేదా ఎన్నికల అధికారికి రాతపూర్వకంగా అభ్యర్థన సమర్పించి, అధీకృత వ్యక్తి ద్వారా సెప్టెంబర్ 24న ఉదయం 10.00 గంటల నుంచి మధ్యాహ్నం 1.00 గంటల వరకు పొందవచ్చని తెలిపారు. మరిన్ని వివరాల కోసం ఎన్నికల అధికారి ఫోన్ నంబర్ 9949992039ను సంప్రదించాలని సూచించారు. ఎన్నికల రోజున పోలింగ్ కేంద్రానికి వచ్చే సభ్యులు గుర్తింపు నిమిత్తం సొసైటీ జారీ చేసిన ఫోటో గుర్తింపు కార్డుతో పాటు ఫోటో గుర్తింపునకు సంబంధించిన ఇతర ఆధారాన్ని తప్పనిసరిగా వెంట తీసుకురావాలని ఎన్నికల అధికారి శివప్రసాద్ కోరారు.

# కనిపించని కన్న బిడ్డలు

జిన్నారం సెప్టెంబర్ 21 సిరి న్యూస్ ఐడిఏ బొల్లారం సర్కిల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఇద్దరు చిన్నారులు, వేర్వేరు ప్రాంతాల నుంచి అదృశ్యమైన ఘటనలు స్థానికంగా తీవ్ర కలకలం రేపాయి. కంటికి రెప్పలా చూసుకుంటున్న కన్న బిడ్డలు కనిపించకుండా పోవడంతో, వారి తల్లిదండ్రులు కన్నీరుమున్నీరవుతున్నారు. బాలాజీ నగర్ కు చెందిన జితేంద్ర కుమార్ బర్మా కుమారుడు, సందీప్ కుమార్ (12) బొల్లారం పబ్లిక్ స్కూల్లో నాలుగవ తరగతి చదువుతున్నాడు, ఆదివారం మధ్యాహ్నం రెండు గంటల సమయంలో ఇంట్లోనే ఉన్న బాలుడు, సాయంత్రం ఐదు గంటలకు తండ్రి విధులు ముగించుకుని ఇంటికి వచ్చేసరికి కనిపించకుండా పోయాడు,ధరించిన దుస్తులు గులాబీ రంగు చొక్కా, జీన్స్ ప్యాంటు, ధరించండి అని తెలిపారు. కాజిపల్లి జిఎంఆర్ కాలనీకి చెందిన రింకూ దేవి కుమారుడు ఆన్మోల్ (10) గత ఎనిమిది రోజులుగా కనిపించకుండా పోయాడు తల్లి పనికి వెళ్లిన సమయంలో ఇంట్లో ఒంటరిగా ఉన్న బాలుడు అదృశ్యమయ్యాడు, గతంలో కూడా బాలుడు ఒకటి రెండు సార్లు ఇంట్లోంచి వెళ్లి తిరిగి వచ్చిన దృష్ట్యా ఈసారి కూడా వస్తాడని భావించినా, జాడ లేకపోవడంతో పోలీసులను ఆశ్రయించారని తెలిపారు. ధరించిన దుస్తులు, తెల్లటి చొక్కా, షార్టు వేసుకున్నాడని తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు సిఐ సుధీర్ కుమార్ కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాం అని తెలిపారు. ఈ బాలుర ఆచూకీ తెలిపిన వారు లేదా ఎలాంటి అనుమానాస్పద సమాచారం ఉన్న వెంటనే ఐడియా బొల్లారం పోలీస్ స్టేషన్ సంప్రదించాలని సిఐ కోరారు.



# బలమైన ఆకాంక్షగా నియోజకవర్గ పోరాటం !

## నియోజకవర్గ హోదా కోసం ఒక్కటవుతున్న రామాయంపేట ప్రజలు

- రెవెన్యూ డివిజన్ సాధనతోనే నియోజకవర్గమంటున్న స్థానికులు
- పూర్వ వైభవం రావాలంటే నియోజకవర్గం కావాల్సిందే..
- ఉద్యమాన్ని ఉధృతం చేస్తామంటున్న ప్రజాసంఘాలు




రామాయంపేటకు తిరిగి అసెంబ్లీ నియోజకవర్గ హోదా సాధించాలన్న ఆకాంక్ష పార్టీలకతీతంగా బలపడుతోంది. రాజకీయ పార్టీలకు అతీతంగా కుల సంఘాలు, ప్రజాసంఘాలు, వివిధ వర్గాల ప్రజలు ఏకతాటిపైకి వచ్చి రామాయంపేటకు నియోజకవర్గ హోదా వచ్చేలా కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు. ముందుగా రామాయంపేట రెవెన్యూ డివిజన్‌ను పూర్తిస్థాయిలో ఏర్పాటు చేసి, పెండింగ్‌లో ఉన్న ప్రక్రియను ప్రభుత్వం వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేస్తున్నారు. అనంతరం జరిగే నియోజకవర్గాల పునర్విభజనలో రామాయంపేటను ప్రత్యేక అసెంబ్లీ నియోజకవర్గంగా ఏర్పాటు చేసేలా అన్ని వర్గాలు సమష్టిగా కృషి చేయాలని కోరుతున్నారు. ఇది ఏ ఒక్క రాజకీయ పార్టీకి సంబంధించిన డిమాండ్ కాదని, రామాయంపేట ప్రాంత భవిష్యత్ అభివృద్ధికి సంబంధించిన ప్రజా ఆకాంక్ష అని స్థానికులు చెబుతున్నారు. గతంలో నియోజకవర్గ హోదా కోల్పోయిన రామాయంపేటకు తిరిగి ఆ హోదా దక్కితే ప్రభుత్వ కార్యాలయాలు, మౌలిక వసతులు, ఉపాధి అవకాశాలు పెరిగి ఈ ప్రాంత అభివృద్ధికి దోహదపడుతుందని వారు అభిప్రాయపడుతున్నారు. రెవెన్యూ డివిజన్ ఏర్పాటుపై ప్రభుత్వం వెంటనే నిర్ణయం తీసుకోవడంతో పాటు, పునర్విభజనలో రామాయంపేట నియోజకవర్గం ఏర్పాటుకు అనుకూలంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఈ డిమాండ్ కోసం కుల సంఘాలు, ప్రజాసంఘాలు, అన్ని రాజకీయ పార్టీలూ సమన్వయంతో ముందుకు కదలడానికి సిద్ధమవుతున్నాయి.

(డి.జి. శ్రీనివాస శర్మ)
(రామాయంపేట-సిరి న్యూస్)

### డివిజన్ ఉద్యమానికి మించి ఉద్యమిస్తాం
### సుంకోజు దామోదర్ చారి, జేఏసీ నాయకుడు

రామాయంపేట నియోజకవర్గం డిలిమిటేషన్ లో పోయిన దాన్ని, అదే డీ లిమిటేషన్ లో సాధించుకోవడం కోసం ఎలాంటి ఉద్యోమానికైనా సిద్ధం. నేను వ్యక్తిగతంగా రామాయంపేట రెవెన్యూ డివిజన్ కోసం ఉద్యమం చేశామో, అంతకంటే పెద్ద ఎత్తున శాసనసభ నియోజకవర్గాన్ని కోసం ఉద్యమిస్తాం.

### నియోజకవర్గం కోసం పోరాటాలు చేస్తాం..
### మెట్టు గంగారం, జిల్లా వ్యవస్థాపక అధ్యక్షులు బీసీ సంక్షేమ సంఘం



రామాయంపేట నియోజకవర్గాన్ని తిరిగి సాధించుకోవడానికి మా ప్రజలతో కలిసి ఏ త్యాగానికైనా సిద్ధమే....రామాయంపేట వచ్చుడో గంగన్న సచ్చుడో అనే విధంగా పోరాటం చేస్తాం.. వదిలిపెట్టే ప్రసక్తే లేదు..

### డివిజన్ తోనే నియోజకవర్గ ఏర్పాటుకు మార్గం సుగమం...
### పాతూరి రాజు, ఎమ్మార్పీఎస్ నాయకులు



రామయంపేట రెవెన్యూ డివిజన్ పూర్తిస్థాయి లో ఏర్పాటు అయితే, నియోజకవర్గం ఏర్పాటుకు మార్గం సుగమం అవుతుంది. ప్రజా సంఘాలతో కలిసి, రెవెన్యూ డివిజన్, నియోజకవర్గం ఏర్పాటుకు ఉద్యమాలు చేస్తాం. ప్రభుత్వం, స్థానిక ప్రజా ప్రతినిధులు, ఎమ్మెల్యే స్పందించాల్సిన అవసరం ఉంది

### రామాయంపేట నియోజకవర్గానికి రెవెన్యూ డివిజన్ కీలకం...
### ఎస్.కె అహ్మద్, బిఆర్ఎస్ నాయకుడు, మాజీ ఎంపీటీసీ



రామాయంపేట భవిష్యత్‌లో నియోజకవర్గం కావాలంటే, పూర్తిస్థాయి రెవెన్యూ డివిజన్ కావాలి. అప్పటి సీఎం కేసీఆర్ మెదక్ పర్యటనలో రామాయంపేట రెవెన్యూ డివిజన్ ప్రకటించారు. కార్యాలయం ఏర్పాటు చేసి ఫర్నిచర్, కంప్యూటర్లు సమకూర్చడంతో పాటు తూప్రాన్ ఆర్డీవోను ఇన్‌చార్జి ఆర్డీవోగా నియమించారు.గతంలో రెవెన్యూ డివిజన్ తీసుకొస్తామని హామీ ఇచ్చిన ఎమ్మెల్యే,, ఆ హామీని నెరవేర్చాలి. ముఖ్యమంత్రితో మాట్లాడి గెజిట్ విడుదల చేయించాలి. అప్పట్లో డివిజన్ కోసం పోరాడిన కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యేపై ఒత్తిడి తీసుకురావాలని డిమాండ్ చేస్తున్నాం.

### అభివృద్ధి కుంటుపడింది...
### పంజా విజయ్, బిజెపి నియోజకవర్గ ఇన్చార్జ్



రామాయంపేట నియోజకవర్గం కోల్పోవడంతో ఉమ్మడి మండలంలో అభివృద్ధి కుంటుపడింది.నియోజకవర్గ సాధన కోసం కలిసికట్టుగా పని చేస్తాం.ఇప్పుడు కాకుంటే మరెప్పుడూ నియోజకవర్గం రాదు. రామాయంపేట అభివృద్ధి జరగాలంటే నియోజకవర్గ సాధనే లక్ష్యం.

### ఎమ్మెల్యే సహకారంతో నియోజకవర్గం ఏర్పాటవుతుంది...
### గజవాడ లావణ్య నాగరాజు, మున్సిపల్ చైర్మన్



ఎమ్మెల్యే రోహిత్ రావు, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు సహకారంతో రెవిన్యూ డివిజన్ ఏర్పాటుకు కృషి చేస్తాం. రెవిన్యూ డివిజన్ ఏర్పాటు తోనే రామాయంపేట పూర్వ వైభవం సంతరించుకుంటుంది. ప్రజల అభీష్టం మేరకు కాంగ్రెస్ పార్టీ పూర్తిస్థాయి రెవిన్యూ డివిజన్ ఏర్పాటుకు కృషి చేస్తుంది.

### రెవిన్యూ డివిజన్ కొనసాగించకపోవడం దురదృష్టకరం.
### బాదే చంద్రం, రామాయంపేట పీఏసీఎస్ చైర్మన్



ప్రజల అభీష్టం మేరకు బీఆర్ఎస్ ప్రభుత్వం హాయంలో ముఖ్యమంత్రి కేసీఆర్ రెవెన్యూ డివిజన్ ప్రకటించారు. మంత్రి హరీష్ రావు చేతుల మీదుగా డివిజన్ కార్యాలయం కూడా ప్రారంభించాం. అధికారం కోల్పోవడం వల్ల దాన్ని కొనసాగించలేకపోయాం. కాంగ్రెస్ పార్టీ, స్థానిక ఎమ్మెల్యే రెవెన్యూ డివిజన్ కొనసాగించకపోవడం దురదృష్టకరం. ప్రజల అభీష్ట మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేసి రామాయపేట ప్రజల కళా నెరవేర్చాలని డిమాండ్ చేస్తున్నాం.

### నియోజకవర్గం – మా ఆత్మగౌరవానికి ప్రతీక.
### రాగి రాములు, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు

రామాయంపేటను నియోజకవర్గంగా ఏర్పాటు చేయడం ఇక్కడి ప్రజల చిరకాల ఆకాంక్ష. ఇది కేవలం రాజకీయ డిమాండ్ కాదు - మన ప్రాంత ఆత్మగౌరవానికి ప్రతీక.రామాయంపేట అభివృద్ధి వేగవంతం కావాలంటే ప్రత్యేక నియోజకవర్గం ఎంతో అవసరం.ప్రజల ఆకాంక్షను ప్రభుత్వం గుర్తించి వెంటనే నియోజకవర్గ ఏర్పాటు ప్రక్రియను ప్రారంభించాలి.రామాయంపేట నియోజకవర్గం సాధించే వరకు ప్రజల పక్షాన మా పోరాటం ఆగదు.

### రెవెన్యూ డివిజన్‌పై పాలకుల నాన్చుడు ధోరణి...
### వెలుముల సిద్ధరాములు, రామాయంపేట జేఏసీ కన్వీనర్, మాజీ ఎంపీటీసీ



ప్రభుత్వాలు మారుతున్నా రామాయంపేట రెవెన్యూ డివిజన్ సమస్యకు పరిష్కారం లభించడం లేదు. గతంలో బిఆర్ఎస్ ప్రభుత్వం రెవెన్యూ డివిజన్ విషయంలో ప్రజలను మోసం చేసింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా వెయ్యి రోజులు గడిచినా హామీ అమలు కాలేదు. రామాయంపేటను రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించే వరకు పోరాటం కొనసాగిస్తాం.



# కాలుష్యం స్థానికులకు.. నిధులు పక్కకు!

## హత్నూర మండలంలో పరిశ్రమల విస్తరణ

- పెరుగుతున్న కాలుష్యం, అనారోగ్య బాధితులు
- కంపెనీల చట్టం సెక్షన్ 135 ప్రకారం స్థానిక ప్రాంతాలకే ప్రాధాన్యత
- కాలుష్య కోరల్లో చిక్కుకున్న 12కు పైగా ప్రభావిత గ్రామాలు
- గుండ్లమాచునూరు, బోరపట్లలో తీరని తాగునీరు, రోడ్ల సమస్యలు
- బడి, వైద్యం, పారిశుధ్యానికి అందని కార్పొరేట్ నిధులు
- కాగితాల్లో స్థానిక పనులు చూపి నిధులు దారిమళ్లిస్తున్న కంపెనీలు
- కాలుష్యానికి గురవుతున్న ప్రజల ఆరోగ్యానికి కనీస భరోసా కరవు
- జిల్లా కలెక్టర్, పరిశ్రమల శాఖ సమీక్ష చేపట్టాలని స్థానికుల డిమాండ్

(మహమ్మద్ జావెద్)
(హత్నూర-సిరిన్యూస్)

సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం పారిశ్రామికంగా వేగంగా అభివృద్ధి చెందుతున్నప్పటికీ, ఆ అభివృద్ధి స్థానిక గ్రామాల ప్రజల పాలిట శాపంగా మారుతోంది. పరిశ్రమల స్థాపన కోసం విలువైన భూములు, అమూల్యమైన భూగర్భ జలాలు, రహదారులు తదితర స్థానిక వనరులను కంపెనీలు యథేచ్ఛగా వినియోగించుకుంటున్నాయి. అయితే వాటి నుంచి వెలువడే ప్రమాదకర రసాయన వ్యర్థాలు, విషవాయువులు, కాలుష్య దుష్ప్రభావాలను మాత్రం ఇక్కడి ప్రజలే నిత్యం భరిస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో కంపెనీలు తమ లాభాల నుంచి చట్టబద్ధంగా ఖర్చు చేయాల్సిన కార్పొరేట్ సామాజిక బాధ్యత నిధులు ఎటు పోతున్నాయనే ప్రశ్న మండలవ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. కాలుష్యం మాత్రం స్థానికులకు ఇచ్చి, సీఎస్ఆర్ నిధులను మాత్రం ఇతర ప్రాంతాలకు తరలించడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది.

### కంపెనీల దాటవేత ధోరణి..

కేంద్ర కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ మార్గదర్శకాల ప్రకారం, కంపెనీల చట్టంలోని సెక్షన్ 135 కింద సీఎస్ఆర్ నిధులను ఖర్చు చేసేటప్పుడు కంపెనీలు తాము పనిచేస్తున్న స్థానిక ప్రాంతాలు, ప్రభావితపరిసరగ్రామాలకేతొలిప్రాధాన్యతఇవ్వాలని స్పష్టంగానిర్దేశించింది.అయితేఈనిబంధననుస్థానిక పరిశ్రమలు తుంగలో తొక్కుతున్నాయి. స్థానిక ప్రాధాన్యత అనేది చట్టపరంగా తప్పనిసరి భౌగోళిక పరిమితి కాదు అనే వెసులుబాటును అడ్డం పెట్టుకుని, లాభాలు ఆర్జిస్తున్నహత్నూర ప్రాంతాన్నిగాలికొదిలేసి తమ అనుకూలమైన ప్రాంతాలకు, కార్పొరేట్ పెద్దల ఆదేశాల మేరకు దూరప్రాంతాలకు నిధులను మళ్లిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

### కాలుష్య కోరల్లో 12కు పైగా గ్రామాలు..

హత్నూర మండల పరిధిలో గుండ్లమాచునూరు, పల్పనూర్, బోరపట్ల, చందాపూర్, మల్కాపూర్, తుర్కల్ ఖానాపూర్, ముచ్చర్ల, వడ్డేపల్లి, చింతలచెరువు, నస్తీపూర్, కాసాల, గోవింద్‌రాజ్‌పల్లి తదితర గ్రామాల్లో 15కు పైగా భారీ ప్రైవేట్ పరిశ్రమలు నిరంతరం కార్యకలాపాలు సాగిస్తున్నాయి. పరిశ్రమల నుంచి వెలువడే వ్యర్థాల వల్ల భూగర్భ జలాలు కలుషితమై తాగేందుకు గుక్కెడు మంచినీరు దొరకని దుస్థితి ఏర్పడింది. కాలుష్య కోరల్లో చిక్కుకున్న ఈ గ్రామాల్లో కనీస రహదారులు, డ్రైనేజీలు, పారిశుద్ధ్యం, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు, ప్రాథమిక వైద్య సదుపాయాల కల్పనకు ఈ సీఎస్ఆర్ నిధులను వినియోగించాల్సి ఉండగా.. యాజమాన్యాలు మొండిచేయి చూపుతున్నాయి.



### సీఎస్ఆర్ లెక్కలు తేలాలి..

మండలంలో ఏర్పాటైన పరిశ్రమలు గత కొన్నేళ్లుగా ఎన్ని కోట్ల రూపాయల సీఎస్ఆర్ నిధులను కేటాయించాయి? అందులో వాస్తవంగా ఖర్చు చేసిన మొత్తం ఎంత? ఏయే గ్రామాల్లో ఏ పనుల కోసం ఖర్చు పెట్టారు? స్థానిక గ్రామాల పేరిట లెక్కలు రాసి పక్కదారి పట్టించారా? అనే సమగ్ర వివరాలపై శ్వేతపత్రం విడుదల చేయాలని స్థానికులు పట్టుబడుతున్నారు. ప్రభుత్వం భూములు కేటాయించి, పరిశ్రమల ఏర్పాటుకు అన్ని అనుమతులు, రాయితీలు కల్పించినప్పుడు.. స్థానిక సమాజానికి తిరిగి ఇవ్వాల్సిన సామాజిక బాధ్యతను కంపెనీలు ఎలా విస్మరిస్తాయని ప్రజలు నిలదీస్తున్నారు.

### జిల్లా కలెక్టర్ సమీక్ష చేపట్టాలి..

హత్నూర మండలంలోని పరిశ్రమల సీఎస్ఆర్ నిధుల కేటాయింపులపై జిల్లా అధికార యంత్రాంగం తక్షణమే దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. జిల్లా కలెక్టర్, జిల్లా పరిశ్రమల కేంద్రం అధికారులు మండలంలోని అన్ని పరిశ్రమల ప్రతినిధులతో ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించాలి. కాలుష్య ప్రభావానికి గురవుతున్న 12 గ్రామాల సర్పంచులు, స్థానిక ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసి.. గ్రామాల అభివృద్ధికి పక్కా ప్రణాళికతో సీఎస్ఆర్ నిధులను ఖర్చు చేసేలా కఠిన ఆదేశాలు జారీ చేయాలని స్థానిక ప్రజలు, ప్రజాసంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. లేనిపక్షంలో పరిశ్రమల గేట్ల ఎదుట ప్రజా ఉద్యమాలు చేపడతామని హెచ్చరిస్తున్నారు.

### స్థానిక గ్రామాలకు కచ్చితంగా ప్రాధాన్యం ఇవ్వాల్సిందే..

పరిశ్రమలకు మా భూములు, మా నీరు, మా గాలి అవసరం.. కాలుష్యాన్ని మేమే భరించాల్సి వస్తుంది. సామాజిక బాధ్యత కింద వచ్చే అభివృద్ధి ప్రయోజనాల్లో స్థానిక గ్రామాలకు కూడా తగిన వాటా ఉండాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. అభివృద్ధి ప్రయోజనాల్లో స్థానిక గ్రామాలకు కచ్చితంగా ప్రాధాన్యం ఇవ్వాల్సిందేనని, ఇదే హత్నూర మండల ప్రజల ప్రధాన డిమాండ్ అని స్పష్టం చేస్తున్నారు.